



"ఎప్పుడూ మేం రావటమే సరిపోతోంది ఈసారి మీరు రాకపోతే ఊర్కునేది లేదు ఇదే మీ ఊరికి రావటం చివరిసారి అవుతుంది అంటూ రిక్షాఎక్కింది సుజాత

అలా ఏం అనుకోకు ఎప్పుడో ఒకసారి ఉన్నట్టుండి నీకు చెప్పకుండా ఇంటిల్లిపాది దిగిపోతాం అప్పుడు నువ్వే అనుకుంటావు ఎందుకు రమ్మన్నాంరా బాబూ అని అంది మాదురి చెల్లెల్ని పంపిస్తూ రిక్షా కనుమరుగైపోయింది

సుజాత పిల్లలతో వచ్చి వారం రోజులుండి వెళ్ళింది వాళ్ళది హైద్రాబాదు వాళ్ళాయనది చాలా పెద్ద ఉద్యోగం నెలకు పదిహేను రోజులు క్యాంపులోనే ఉంటాడు తోచనప్పుడల్లా పిల్లల్ని వేసుకుని దిగుతుంది సుజాత

మాధురి భర్త ఎల్ఐసీలో డెవలప్మెంట్ ఆఫీసర్ ఇద్దరు మగపిల్లలు ఇద్దరాడపిల్లలు సంపాదనలో పెద్దగా మిగుల్చుకోవటానికి వీల్లేకపోయినా ఆడపిల్లలిద్దరి పేరు మీద ఇన్సూరెన్స్ చేయించాడు చుట్టాలుమటుకు అలా నెల పొడుగునా ఎవరో ఒకళ్ళు వస్తూనే ఉంటారు మాధురి వాళ్ళకు ఒక ఎకరం మాగాణీ ఉంది దాంతో ఎప్పుడూ రెండు మూడు బస్తాల బియ్యం ఇంట్లో నిల్వ ఉంటాయి అందుకే అర్ధరాత్రొచ్చినా విసుక్కోకుండా బియ్యం పడేస్తుంది పొయ్యిమీద

ఈరోజుల్లో కూడా ఇటువంటి కుటుంబాలు ఉన్నాయా అనిపిస్తుంది వాళ్ళను చూస్తుంటే చుట్టాలతో సరదాగా గడపాలంటే విశ్వేశ్వరరావుకెంత ఇష్టమో మాటల్లో చెప్పలేం అతనికి సెలవు రోజుల్లో తోచనప్పుడల్లా రైల్వేస్టేషన్కో బస్టాండుకో వెళ్ళటం వచ్చేటప్పుడు ఎవర్నో ఒకళ్ళని వెంటేసుకు రావటం బహు చెడ్డ అలవాటు అతని గొప్పదనం కాదు కాని ఆ మహా ఇల్లాల్ని గురించి చెప్పుకోవాలి విసుగు కోపం అనేది ఏ మాత్రం కన్పించదు ఇంటికి పొరపాటున ఒక చుట్టం వచ్చినా హిస్టీరిక్గా విరుచుకు పడిపోయే చాలామంది ఆడవాళ్ళున్న ఈ రోజుల్లో ఆమె ఎలా వేగ్గలుగుతోందో ఏమో!

ఒకసారి బస్టాండులో విశ్వేశ్వర్రావుకి అతను కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లో తనతో బాగా చనువుగా ఉండే ఫ్రెండొకడు బస్ కోసం ఎదురు చూస్తూ విశ్వేశ్వర్రావు కంటపడ్డాడు ఎన్నో సంవత్సరాల తర్వాత కలుసుకున్న ఆ మిత్రులిద్దరూ ఎంతోసేపు మాట్లాడుకున్నాక అతను వెళ్ళవల్సిన బస్ కాన్సిల్ అయినట్టు తెల్సింది మళ్ళీ రాత్రి వరకు బస్లేదు

సరేలేవోయ్ వెధవ బస్సు లేకపోతే లేకపోయింది నువ్విప్పుడు వెలగబెట్టాల్సిన రాచకార్యం ఏముంది కాని పద మనింటికి అంటూ బలవంతం చేశాడు విశ్వ

సరే సరే ఇప్పుడింట్లో వాళ్ళని ఇబ్బంది పెట్టటం ఎందుకోయ్ ఇక్కడ తెల్సినవాళ్ళ రూమ్కి వెళ్తాను ఇబ్బందిగా చూసాడు రామారావు

అతనలా అనగానే మొహం వాచేటట్టు చివాట్లు వేశాడు విశ్వా దాంతో అతని వెంట వెళ్ళటం తప్పలేదు రామారావుకి

మధ్యలో అన్నాడు సామాన్యంగా నేను ఎవరింటికి వెళ్ళనురా విశ్వా! నీకు తెల్సుగా నా శరీరతత్వం అందరూ కడుపులో గోనెసంచి పెట్టుకున్నావా ఏంటి గిన్నెలన్ని ఖాళీ చేసేస్తున్నావు అనేవాళ్ళు ఇప్పుడు నువ్వున్నావు రెండు ముద్దలు తిని ఒక గ్లాసు మంచినీళ్ళు తాగితే బ్రేవుమని తేనుస్తావు నాశరీరం అలా కాదే! దానికి ఇంత అని ఒక కొలబద్దలేదు సొరంగంలోకి పోసినట్లే ఒక్కోసారి నాకే నగ్నగా ఉంటుంది నా పరిస్థితిని చూస్తుంటే! ఏంటీ నవ్వుతున్నావు

నిజం! నువ్వు నమ్మలేవు ఈ మధ్య జరిగిన ఒక గమ్మత్తు చెపుతాను విను ఆఫీసు పనిమీద వచ్చిన నేను ఒకసారి

# సలహా

హైదరాబాదులో ఇరవై రోజులు ఉండిపోయాను ఫుల్‌మీల్స్ సప్లయి చేస్తున్న ఒక హోటల్లో ఇరవై రోజులకు టిక్కెట్లు కొన్నాను రెండు రోజుల్లో వాడికి నేనేమిటో అర్థం అయిపోయింది ఒక రోజు రెండు చేతులు నావి పట్టుకుని క్షమించండి సార్ మీలాగా బోజనం చేసేవాళ్ళని మేమెక్కడా చూడలేదు ఈ డబ్బు తీసుకుని ఆ టిక్కెట్లు ఇచ్చేయండి అంటూ కళ్ళనీళ్ళు కూడా పెట్టుకున్నాడు అదిరా అసలు విషయం ఇప్పుడు చెప్పు నీ కిబ్బంది పెట్టటం 'ఇష్టంలేదు నన్నొదిలేయవయ్యా అంటే వినవ్ అన్నాడు దీర్ఘంగా శ్వాసవిడుస్తూ

వాల్లేవోయ్ నీ కబుర్లు నీకు చిన్నప్పట్నుండి అతిశయోక్తులు చెప్పటం అంటే మహా సరదా అప్పట్లో మంచి హాస్య కథలు ఐదారు రాసినట్లు కూడా ఉన్నావు ఒకవేళ నువ్వు చెప్పిందే నిజమైతే నేనసలు బాధపడను కాక బాధపడను నీ ఆకలి తీర్చిన పుణ్యం నాకు దక్కుతుంది సంవత్సరానికి ఇరవై ముప్పయి మంది చుట్టాలు వస్తూంటారు మా ఇంటికి ఇంతవరకు నేనుగాని మా ఆవిడగాని ఒక్కసారి కూడా బాదపడలేదంటే అసలు నువ్వు నమ్మవు అంటూ బుజంమీద చేయి వేసి సందులోకి లాక్కెళ్లాడు

ఇల్లొచ్చేసింది ఎవరో వ్యక్తిని తీసుకుని విశ్వేశ్వర్రావు లోపలికివస్తూ ఉంటే మాదురి ఆశ్చర్యపోలేదు ఆమె దృష్టిలో అత్యంత సహజమైనది ఇదే లోపలికి వస్తూనే ఇతనెవరో తెలుసా? అని అడిగాడు భార్యని ఆమెకు తెలియదని అతనికి తెలుసు కాని అలా అడగటం మామూలే

వంటింట్లో విశ్వేశ్వర్రావు ఏదో గొణుగుతూ కన్పడటం అతని భార్య చేయి అడ్డుపెట్టుకొని నవ్వుతూండటం రామారావు చూసాడు మొహం తుడుచుకుంటూ అతను కూడా వంటింటి దగ్గరకు వచ్చాడు

ఏమ్మా మావాడేదో చెప్తున్నట్టున్నాడు నా గురించి ఏరా అంతా చెప్పేసావా మీ ఆవిడతో ఎమ్మా! నువ్వు కూడా నమ్మేసావా? వండటానికి బియ్యం ఎక్కువ పోస్తున్నావేమోనని చెప్తున్నాను అదంతా వట్టి తమాషాకి 'చెప్పాను నేనేమైనా రాక్షసుడ్నా హాంపట్టున అన్ని గిన్నెలు ఖాళీ చేయటానికి? నాలుగు ముద్దలు తింటే నాలుగు రోజులు తిండిలేకుండా ఉండగలను ఆ అమాయకుడంటే నమ్మేసాడు తెలివిగలదానివి నువ్వెలా నమ్మావ్ అంటూ నవ్వుకుంటూ ముందు గదిలోకి వెళ్ళిపోయాడు

ఆ రోజు ఖచ్చితంగా రామారావు తిన్నది నాలుగు ముద్దలే మరీ అంత తక్కువ తిన్నందుకు విశ్వేశ్వర్రావు మాదురి చాలా బాధపడ్డారు




ఆ సాయంత్రం రామారావు పిల్లల చేతిలో కొంత డబ్బు పెట్టి థాంక్స్ చెపుతూ రిక్షా ఎక్కాడు లోపలికొచ్చిన విశ్వేశ్వర్రావుకు టేబుల్‌పై మడిచి ఉంచిన కాగితం కన్పడటంతో ఆశ్చర్యంగా విప్పి చదవసాగాడు

మైడియర్ విశ్వూ!

ఎలా పోషిస్తున్నావురా ఇంటికొచ్చిన అందరిని? నువ్వేమి లక్షాధికారివికాదు అయినా దేశంలో అవినీతి అధర్మం విచ్చల విడిగా పెరిగిపోయి అవతల వాళ్ళ పొట్టల్ని కొట్టుతున్న ఈ రోజుల్లో దారిన పోతున్న దానయ్యల్ని పిల్చి ఈ కంచి గరుడసేవ ఎందుకురా చేస్తావ్? నువ్విలా చేస్తున్నంత కాలం నీ ఇల్లు హౌస్‌ఫుల్ కలెక్షన్లలో ఆడుతున్న సినిమా థియేటర్లా ఉంటుంది నిజానికి నేను నీకు చెప్పినట్లు బాగా తిండిపోతునే మనం కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లో జిలేబీల పోటీలోనూ గారెలు తింటంలోనూ పస్టువచ్చానన్న విషయం నీకు గుర్తు లేదటరా! నిన్నూ నీ బార్యనూ చూసాక మీ మంచితనం గమనించాక నా మీద నాకే అసహ్యం కలిగింది ఏనుగులా శరీరాన్ని పెంచినందుకు దాన్ని పోషిస్తున్నందుకు మీ ఇద్దరికి ఏదో ఒక రోజు మీ ఇంటికొచ్చేవాళ్ల మీద అసహ్యం కలిగి తీరుతుంది మీ ఇద్దరికి నా సలహా ఏమిటంటే మెల్లి మెల్లిగా మీరు ఈ మర్యాదలు తగ్గించేయండి మీ ఇంట్లో అంతా తిని పోయే వాళ్ళేగాని మీ పిల్లల చేతిలో ఒక కాయో పండో పెట్టినవాళ్ళు కూడా ఉండి ఉండరు బహుశా ఇటువంటి సలహా నీకెవరు ఇచ్చి ఉండరు బాగా ఆలోచించుకో నీ శ్రేయోభిలాషిని కాబట్టి చెప్పాను ఎప్పుడూ వన్‌వే ట్రాఫిక్ అయిపోయింది మీ పని మిమ్మల్ని ఎవరెవరు మీ పద్ధతిలో ఆహ్వానించారో ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి ఉంటాను ప్రేమతో రాము

విశ్వేశ్వర్రావు ఆలోచిస్తూ ఉండిపోయాడు